క్లుప్తంగా

వైఎస్సార్‌సీపీ ఐటీ వింగ్ ఇన్‌చార్జిగా వెంకట సుబ్బయ్య


వెంకట సుబ్బయ్య

ఆత్మకూరురూరల్ (మర్రిపాడు): మర్రిపాడు మండలం సింగనపల్లికి చెందిన గుద్దేటి వెంకట సుబ్బయ్య వైఎస్సార్‌సీపీ ఐటీ వింగ్ 6వ జోన్ ఇన్‌చార్జిగా నియమిస్తూ ఆ పార్టీ రాష్ట్ర కమిటీ నిర్ణయం తీసుకుంది. నెల్లూరు, వైఎస్సార్, తిరుపతి జిల్లాల పరిధిలో పార్టీ సేవలను మరింత విస్తృత పరచడానికి తన వంతు కృషి చేస్తానని ఆయన ఈ సందర్భంగా తెలిపారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర నాయకులు, మాజీ ఎంపీ మేకపాటి రాజమోహన్‌రెడ్డి, ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి, ఐటీ వింగ్ రాష్ట్ర అధ్యక్షుడు సునీల్‌కుమార్‌రెడ్డి మార్గదర్శకంలో పార్టీ అభ్యున్నతికి కృషి చేస్తామన్నారు.

చవితి వేడుకలకు అనుమతులు తప్పనిసరి


మాట్లాడుతున్న సీఐ రవినాయక్

సంగం: వినాయచవితి సందర్భంగా ఏర్పాటు చేసే విగ్రహాల ఏర్పాటుకు, వేడుకలకు అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలని సంగం సీఐ రవినాయక్ అన్నారు. బుధవారం ఆయన తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ ప్రజలకు అసౌకర్యంగా ఉండే పబ్లిక్ ప్రదేశాల్లో వినాయక విగ్రహాలను ఏర్పాటు చేయరాదన్నారు. ప్రజలు ప్రశాంత వాతావరణంలో వినాయకచవితి పండగను జరుపుకోవాలన్నారు. మండపాల వద్ద జరిగే ఘటనలకు కమిటీ నిర్వాహకులే బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు.

నిబంధనలు పాటించాలి


మాట్లాడుతున్న ఎస్సై ఇంద్రసేనారెడ్డి

ఉదయగిరి: మండలంలో ఈ నెల 18 నుంచి జరిగే వినాయక చవితి ఉత్సవాల నిర్వహణకు పోలీసుల అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలని ఎస్సై కర్నాటి ఇంద్రసేనా రెడ్డి తెలిపారు. ఆయన బుధవారం తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ ఉత్సవాలు ప్రశాంత వాతావరణంలో జరుపుకునేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. విద్యుత్ ఏర్పాటుకు ట్రాన్స్‌కో అధికారుల అనుమతులు ఉండాలన్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

భక్తి శ్రద్ధలతో జటఫట్ బీబీ 37వ గంధ మహోత్సవం


ప్రత్యేక ప్రార్థనలు నిర్వహిస్తున్న మత పెద్దలు

ఉదయగిరి: ఉదయగిరి దుర్గంపై ఉన్న జటపట్ బీబీ 37వ గంధం మహోత్సవం బుధవారం భక్తి శ్రద్ధలతో జరిగింది. అశేష భక్తుల మధ్య అత్యంత కోలాహలంగా భక్తి శ్రద్ధలతో గంధం ఊరేగింపుగా బీబీ దర్గాకు చేరుకుంది. చదివింపులు అనంతరం గంధాన్ని భక్తులకు పంచి పెట్టారు. పలువురు మొక్కులు చెల్లించుకున్నారు. దీంతో పాటు కొండ పండగ (వన మహోత్సవం) కావడంతో పర్యాటకులు భక్తులతో దుర్గం కిక్కిరిసిపోయింది. వచ్చిన భక్తులు, పర్యాటకులు వన మహోత్సవంలో భాగంగా భోజనాలు అక్కడే ఆరగించారు.

పథకాలు అర్హులకు అందేలా చూడాలి


మాట్లాడుతున్న కన్వీనర్ ఓబుల్‌రెడ్డి

ఉదయగిరి: మండలంలో గ్రామ సచివాలయాల పరిధిలో పనిచేసే వలంటీర్లు, గృహ సారథులు, కన్వీనర్లు, నాయకులు ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా చూడాలని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ గానుగపంట ఓబుల్‌రెడ్డి అన్నారు. ఆయన బుధవారం మండలంలోని తిరుమలాపురం సచివాలయ పరిధిలోని గుడినరవలో వలంటీర్లు, కన్వీనర్లతో సమావేశం నిర్వహించారు. ఏవైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకువస్తూ బాధ్యతగా సమన్వయంతో పనిచేస్తూ ప్రభుత్వానికి మంచి పేరు తేవాలన్నారు. ఇంటింటికి తిరిగి ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించాలన్నారు. వలంటీర్లు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులపై సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఎంతో నమ్మకాన్ని పెట్టుకున్నారని, ఆ నమ్మకాన్ని వమ్ము చేయకుండా పని చేయాలన్నారు. జేసీఎస్ కన్వీనర్ కల్లూరి కృష్ణారెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ బి.శ్రీనివాసులు, సచివాలయ కన్వీనర్ మాల కొండారెడ్డి, మాజీ సర్పంచ్‌లు ఏ సుబ్బారెడ్డి, బి.వెంకటేశ్వర్లు, నాయకులు కె.ప్రభాకర్‌రెడ్డి, పెరుమాళ్లు, ఎస్.జనార్దన్, రామాంజనేయులు పాల్గొన్నారు.

చదువే మన సంపద

చేజర్ల (సోమశిల): బాల్యం నుంచి కష్టపడి చదువుకుంటే చదువే మన సంపద అవుతుందని అనంతసాగరం ఎంఈఓ ఎం బాలకృష్ణారెడ్డి తెలిపారు. బుధవారం అనంతసాగరం మండలం సోమశిల ఎస్టీ కాలనీలో చదువుపై కళాజాత నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సోమశిల హెచ్‌ఎం శంకరయ్య, గురుకుల పాఠశాల వైస్ ప్రిన్సిపల్ ప్రభాకర్ పాల్గొన్నారు.

ప్రతి ఇంటికి జీవజలాలు

ఆత్మకూరు నియోజకవర్గంలో సుమారు రూ.60 కోట్ల వ్యయంతో జలజీవన్ మిషన్ పథకం ద్వారా జీవజలాలు తాగునీరుగా అందించేందుకు చేపట్టిన పనులు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి చొరవతో చురుగ్గా సాగుతున్నాయి. రెండు దశల్లో 382 పనులను గుర్తించి టెండర్ ప్రక్రియ ద్వారా పనులు చేపట్టారు. ప్రధానంగా గ్రామీణ ప్రాంతాల్లోని ఎస్సీ,ఎస్టీ కాలనీల్లో ప్రతి ఇంటికి తాగునీరు అందించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు.

- ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి చొరవతో జల్‌జీవన్ మిషన్ పథకానికి శ్రీకారం
- రూ.59.08 కోట్లతో రెండు దశల్లో పనులు
- సమస్యాత్మక ప్రాంతాల్లో 65 ఓవర్‌హెడ్ ట్యాంకుల నిర్మాణం


అనంతసాగరం మండలంలో రక్షిత మంచినీటి పథకం ప్రారంభించిన ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి (ఫైల్)

ఆత్మకూరు/ఆత్మకూరురూరల్: గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి ఏడాది కాలంగా నియోజకవర్గంలో పర్యటించిన నేపథ్యంలో తాగునీటి ఇబ్బందులను గుర్తించారు. ప్రజలకు సురక్షితమైన తాగునీరు అందించేందుకు జల్‌జీవన్ మిషన్ ద్వారా ప్రభుత్వం నుంచి రూ.59.08 కోట్ల నిధులు మంజూరు చేయించారు. రెండు దశల్లో ఈ పనులు పూర్తయ్యేలా ప్రణాళికలు రూపొందించారు. తొలి విడతలో రూ.20.25 కోట్లు నిధులతో 311 పనులను మంజూరు చేయగా, ఇప్పటికే వందకుపైగా పనులు పూర్తయ్యాయి. రెండో విడతలో 71 పనులను రూ.28.40 కోట్ల వ్యయంతో చేపట్టేందుకు ప్రతిపాదించిన పనులు టెండరు దశలో ఉన్నాయి. ప్రతి ఇంటికి సురక్షితమైన తాగునీటిని అందించడమే లక్ష్యంగా ఈ పనుల పురోభివృద్ధిపై ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో ఎప్పటికప్పుడు సమీక్షలు నిర్వహిస్తున్నారు. ఎస్సీ, ఎస్టీ కాలనీల్లో ప్రతి నివాసానికి తాగునీరు అందించేందుకు 65 ఓవర్‌హెడ్ ట్యాంకుల నిర్మాణాలకు ప్రత్యేక కార్యాచరణతో టెండర్లు పిలువనున్నారు.

తొలి దశ ప్రణాళిక..

తొలి విడత మండలాల వారీగా ఏఎస్‌పేట మండలంలో 40 పనులకు రూ.133.64 లక్షలు, ఆత్మకూరులో 64 పనులకు రూ.388.32 లక్షలు, అనంతసాగరం మండలంలో 62 పనులకు రూ.803.04 లక్షలు, చేజర్లలో 33 పనులకు రూ.183.05 లక్షలు, మర్రిపాడు మండలంలో 72 పనులకు రూ.657.99 లక్షలు, సంగం మండలంలో 40 పనులకు రూ.339.9 లక్షలను మంజూరు చేసి పనులు ప్రారంభించగా వివిధ దశల్లో ఉన్నాయి. ఇప్పటికే 137 పనులు పూర్తి కాగా, 101 తాగునీటి వసతి పనులు నిర్మాణ దశలో ఉన్నాయి.

రెండో విడత ప్రణాళిక

రెండో విడత పనులు ప్రారంభానికి అధికారులతో ఇటీవల సమావేశం నిర్వహించారు. ఇందుకోసం మండలాల వారీగా ఏఎస్‌పేట మండలంలో 9 పనులకు రూ.166.20 లక్షలు, అనంతసాగరంలో 8 పనులకు రూ.202.50 లక్షలు, ఆత్మకూరు మండలంలో 34 పనులకు రూ.1,744.50 లక్షలు, చేజర్లలో 3 పనులకు రూ.83.40 లక్షలు, మర్రిపాడు మండలంలో 11 పనులకు రూ.534.40 లక్షలు, సంగం మండలంలో 6 పనులకు రూ.128.70 లక్షలు మంజూరు చేయించారు. ఈ పనుల్లో ప్రధానంగా దళిత కాలనీలకు సురక్షితమైన తాగునీరందించే ప్రణాళికలు ఉన్నాయి. సుమారు 3 దశాబ్దాల క్రితం అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వంలోనే రాజీవ్ టెక్నాలజీ మిషన్ ద్వారా తాగునీరు అందించిన పనులు తప్ప అనంతరం నియోజకవర్గంలో శాశ్వత తాగునీటి పనులు జరగకపోవడం ప్రస్తుతం ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి తాగునీటికే భారీ నిధులు కేటాయింపులు చేసి పనులు చేయిస్తుండడంపై ప్రజలు తమ సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

సంక్షేమ పథకాలతో ఆర్థిక వెలుగులు


లబ్ధిదారులకు సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందిస్తున్న ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి

- కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి

కావలి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో సంక్షేమ పథకాలతో రాష్ట్రంలోని లక్షలాది కుటుంబాల్లో ఆర్థిక వెలుగులతో వెలకట్టలేని సంతోషాన్ని నింపుతున్నాయని ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని 17వ వార్డులో బుధవారం 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమాన్ని ఎమ్మెల్యే నిర్వహించారు. ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల వివరాలను ఎమ్మెల్యే వివరించారు. ఆయన మాట్లాడుతూ గతంలో చంద్రబాబు ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ఏ ఒక్కటీ కూడా అమలు చేయలేదని ఎమ్మెల్యే గుర్తు చేశారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజా సంకల్ప పాదయాత్ర, ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతి హామీని అమలు చేశారనే విషయం మీకు తెలుసన్నారు. నాడు– నేడు ద్వారా ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మారుస్తూ విద్యావ్యవస్థలో విప్లవాత్మకమైన మార్పులు తీసుకువచ్చారని చెప్పారు. ప్రైవేట్ స్కూళ్లకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మార్చిన ఘనత వైఎస్ జగన్ ప్రభుత్వానిదన్నారు. విద్యా రంగంలో సమూలమైన మార్పులు, సంస్కరణలతో అంతర్జాతీయ ప్రమాణాలతో విద్యా విధానం రూపొందించారని చెప్పారు. చదువుకున్న ప్రతి ఒక్కరూ ప్రయోజకులు అయితే ఆ కుటుంబం తలరాత మారిపోతుందని, పేదరికం నిర్మూలన జరుగుతుందని సీఎం బలంగా నమ్మారని చెప్పారు. పాఠశాల విద్య మాత్రమే కాకుండా, డిగ్రీ, ఇంజినీరింగ్, మెడిసిన్ వంటి పెద్ద పెద్ద చదువులను ఉచితంగా చెప్పిస్తున్నారన్నారు. ప్రజలకు మంచి చేయడమే ధ్యేయంగా పని చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వానికి అండగా ఉండి ఆశీర్వదించాలని ఎమ్మెల్యే విజ్ఞప్తి చేశారు. జగనన్న ఇచ్చిన మాటకు కట్టుబడి ఎన్నో సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారని తెలిపారు. పేదరిక నిర్మూలనే ధ్యేయంగా పాలన సాగిస్తూ, గాంధీజీ కలలు కన్న గ్రామ స్వరాజ్యం తెచ్చిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిదేనన్నారు. ఈ కార్యక్రమంలో గంధం ప్రసన్నాంజనేయులు, నంబూరి వెంకటేశ్వర్లురెడ్డి, పలకా వెంకటేశ్వర్లురెడ్డి, వేమిరెడ్డి రామ్మోహన్‌రెడ్డి, వేలమూరి జగదీష్‌రెడ్డి, పులిమి గోపాల్‌రెడ్డి, మేదరమెట్ల జయరామిరెడ్డి, శెట్టిపల్లి రమేష్, గుండాబత్తిన వెంకట్రావు, దావులూరి మాలకొండయ్య, కనపర్తి రాజశేఖర్, పేరం వెంకటేశ్వర్లు, షేక్ జానీ భాష తదితరులు పాల్గొన్నారు.

ఏటీఎం మోడల్‌లో ప్రకృతి వ్యవసాయ పంటలు


ఏటీఎం మోడల్ ప్రకృతి వ్యవసాయంలో విత్తనాలు నాటుతున్న రైతులు, అధికారులు

ఆత్మకూరురూరల్: ఆంధ్రప్రదేశ్ రైతు సాధికార సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రకృతి వ్యవసాయ విభాగం అధికారులు మండలంలోని మహిమలూరులో ప్రయోగాత్మకంగా బుధవారం ఏటీఎం మోడల్‌లో వ్యవసాయ పంటల సాగును ప్రారంభించారు. ఇరగన శ్రీనివాసులుకు చెందిన 20 సెంట్ల పొలంలో 18 రకాల పంటలు వేసి ప్రతి నెలా ఆదాయం వచ్చే ఏర్పాట్లు చేస్తున్నామని ప్రాంతీయ సాంకేతిక సమన్వయకర్త రవిచంద్ర ప్రసాద్ తెలిపారు. అనంతపురం జిల్లా కేంద్రం నుంచి విచ్చేసిన సురేంద్రరెడ్డి ఆధ్వర్యంలో ఆత్మకూరు మండలంలో పని చేస్తున్న ప్రకృతి వ్యవసాయ సిబ్బందిని ఒక సమూహంగా ఏర్పాటు చేసి ఈ కొత్త మోడల్ ప్రకృతి వ్యవసాయం ప్రారంభిస్తున్నామన్నారు. వీటిలో క్యారెట్, బీట్‌రూట్, ముల్లంగి, చిక్కుడు, అలసంద, మొక్కజొన్న, ఆకు కూరలు, పొద్దు తిరుగుడు, ధనియాలు, మెంతులు, మొదలైన రకాలు కేవలం 20 సెంట్ల పొలంలో 4 అడుగులకు ఒక తోట విత్తి ఈ విధానం అమలు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో మెంటర్ సుబ్బమ్మ, మేకర్స్ శ్రీనివాసులు, ప్రసాద్, ఎంసీఆర్‌పీ పద్మ, ఐపీఆర్‌పీలు తిరుపతయ్య, వెంకటేశ్వర్లు, సుబ్బారాయుడు, రమణమ్మ, విజయ, తిరుపతమ్మ, తదితరులు పాల్గొన్నారు.

ప్రజారవాణా సంస్థ కార్మిక సంఘాల సంబరాలు


ఆనందం వ్యక్తం చేస్తున్న యూనియన్ నేతలు

ఉదయగిరి: ప్రజా రవాణా సంస్థలో పనిచేసే కార్మికుల సంఘాలకు ప్రభుత్వం ప్రత్యేక గుర్తింపునిస్తూ మంగళవారం జీఓ విడుదల చేయడంపై స్థానిక ఆర్టీసీ డిపో ఎదుట బుధవారం నేషనల్ మజ్దూర్ యూనియన్ అసోసియేషన్, ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు గేట్ మీటింగ్‌లు నిర్వహించి సంబరాలు జరుపుకున్నారు. టపాకాయలు పేల్చి స్వీట్లు పంచి పెట్టుకున్నారు. పలువురు యూనియన్ నాయకులు మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేశారన్నారు. ప్రజారవాణా సంస్థలో పనిచేసే యూనియన్లకు ప్రత్యేక గుర్తింపు ఇవ్వడం సంతోషకరమన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు మౌలాలి, హబీబ్, శీనారెడ్డి, విజయభాస్కర రెడ్డి,పెంచలయ్య, రఫీ, ఎం.శ్రీని వాసులు, నరసింహా, రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎంప్లాయిస్ యూనియన్ ..


ఆత్మకూరు ఆర్టీసీ డిపో ఎదుట సంబరాలు చేసుకుంటున్న ఎంప్లాయిస్ యూనియన్

ఆత్మకూరురూరల్: ఏపీఎస్‌ఆర్టీసీ ప్రభుత్వంలో విలీనం తర్వాత గుర్తింపు లేని కారణంగా పీటీడీ ఉద్యోగులు ఇబ్బందులు ఎదుర్కొన్నారని, ఈ విషయం ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడంతో ఎంప్లాయీస్ యూనియన్‌కు ప్రభుత్వ గుర్తింపునిస్తూ సానుకూల నిర్ణయం తీసుకోవడంపై ఆత్మకూరు ఆర్టీసీ డిపోలో ఉద్యోగులు బుధవారం స్వీట్లు పంచి సంబరాలు చేసుకున్నారు. కార్యక్రమంలో ఆత్మకూరు డిపో ఎంప్లాయీస్ యూనియన్ అధ్యక్షుడు కోవూరు విజయ్‌కుమార్, కార్యదర్శి మేకపాటి చిన్నారెడ్డి, తదితరులు ఆర్టీసీ ఉద్యోగులు ప్రభుత్వానికి అండగా ఉంటామని తెలిపారు. కార్యక్రమంలో ఆర్టీసీ నాయకులు తిరుమలరెడ్డి, హుస్సేన్, సునీల్‌రెడ్డి, గ్యారేజీ అధ్యక్ష, కార్యదర్శులు మధుసూదన్, మల్లికార్జున్ పాల్గొన్నారు.

జగనన్న పాలనలో ప్రతి కుటుంబానికీ లబ్ధి

జలదంకి: సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ప్రతి కుటుంబానికీ లబ్ధి చేకూరుతుందని వేములపాడు సర్పంచ్ బోడిమండ్ల వెంకటకృష్ణారెడ్డి అన్నారు. బుధవారం ఆయన మండలంలోని వేములపాడు పంచాయతీలో నూతనంగా మంజూరైన పింఛన్లను లబ్ధిదారులకు అందించారు. ఆయన పరిపాలనలో ప్రతి ఒక్కరూ లబ్ధిపొందుతున్నారని, మళ్లీ సీఎంగా చేసుకోవడానికి అందరం కృషి చేయాలని కోరారు.

పక్కాగా జగనన్న ఆరోగ్య సురక్ష

వరికుంటపాడు: మండలంలో ఈ నెలలో జరిగే జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని పక్కాగా నిర్వహించాలని ఎంపీడీఓ చేవూరు శ్రీదేవి తెలిపారు. ఆమె బుధవారం తన కార్యాలయంలో మండల స్థాయి అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ నెల 15 నుంచి జగనన్న ఆరోగ్య సురక్ష ఇంటింటి సర్వే జరుగుతుందన్నారు. 30వ తేది నుంచి వైద్య శిబిరాలు సచివాలయ పరిధిలో జరుగుతాయన్నారు.

ట్యాబ్‌ల నిర్వహణపై బాధ్యత వహించండి

- డివిజన్ స్థాయిలో బైజూస్ ట్యాబ్‌లపై శిక్షణ


బైజూస్ ట్యాబ్‌ల నిర్వహణపై శిక్షణ ఇస్తున్న అధికారులు

ఆత్మకూరు: రాష్ట్ర ప్రభుత్వం విద్యకు అధిక ప్రాధాన్యత ఇచ్చే క్రమంలో 8, ఆపై తరగతుల విద్యార్థులకు ట్యాబ్‌లు అందజేసిందని, వాటి నిర్వహణ విషయంలో ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు బాధ్యత వహించాలని జిల్లా సమగ్ర శిక్షా కేంద్రంలో ఏపీఓ ప్రసాద్, ఆత్మకూరు ఎంఈఓ నజీర్‌బాషా సూచించారు. డివిజన్‌లోని 11 మండలాల ఉన్నత పాఠశాలల ఉపాధ్యాయులకు బైజూస్ ట్యాబ్‌ల నిర్వహణపై ఒక్క రోజు శిక్షణ కార్యక్రమం బుధవారం పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహించారు. జిల్లా సమగ్ర శిక్షా కేంద్రం అధికారులు ఏపీఓ ప్రసాద్, కేవీఆర్ మూర్తి, సురేంద్ర మాట్లాడుతూ ట్యాబ్ స్క్రీన్లు పగిలితే సచివాలయంలోని డిజిటల్ అసిస్టెంట్‌కు అందించి వారితో టికెట్ రైజ్ చేయించి మరమ్మతులు చేసి సంబంధిత విద్యార్థికి అందజేయాలన్నారు. ప్రతి ట్యాబ్‌లో మూడు యాప్స్ మాత్రమే ఉండేలా గూగుల్ అథెంటిఫికేటర్ యాప్‌ను ప్రతి ఒక్క విద్యార్థికి ఫీడ్ చేసి ఇవ్వాలన్నారు. తద్వారా బైజూస్ ట్యాబ్ దుర్వినియోగం కాకుండా కాపాడుకోవచ్చునన్నారు. విద్యార్థులు ట్యాబ్‌ల్లో క్యూ ఆర్ కోడ్‌లు, ఎస్‌టీకార్డుల లోపాలను ఎలా సవరించుకోవాలో శిక్షణ పొందుతున్న ఉపాధ్యాయులు వివరించాలని తెలిపారు. విద్యార్థులు ట్యాబ్‌లను సమర్థవంతంగా వినియోగించుకుని తమ భవిష్యత్‌కు బాటలు వేసుకునేలా వారికి అవగాహన కల్పించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం అనంతలక్ష్మి, ఉపాధ్యాయ సంఘం అధ్యక్షులు సోమవరపు భాస్కర్‌రెడ్డి, ఎంఈఓ–2 చలపతి, మండలాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా ఎస్‌జీఎఫ్ ఎంపిక పోటీలు ప్రారంభం


ఎస్‌జీఎఫ్ పోటీల్లో భాగంగా కబడ్డీ పోటీలు నిర్వహిస్తున్న దృశ్యం

ఆత్మకూరు: గ్రామీణ ప్రాంతాల్లో ఆణిముత్యాలు లాంటి క్రీడాకారులను ఎంపిక చేసేందుకు ఉద్దేశించిన స్కూల్ గేమ్స్ క్రీడా పోటీలు (ఎస్‌జీఎఫ్) బుధవారం పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో ఉత్సాహంగా ప్రారంభమయ్యాయి. రెండు రోజుల పాటు జరిగే ఈ పోటీల్లో తొలి రోజు బుధవారం కబడ్డీ, త్రోబాల్, బాల్‌బ్యాడ్మింటన్, షటిల్ క్రీడలు నిర్వహించారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాల పీడీ తిరుపతయ్య నేతృత్వంలో పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థులను నియోజకవర్గ స్థాయికి ఎంపిక చేశారు. మండలంలోని వివిధ పాఠశాలలకు చెందిన 240 మంది విద్యార్థులు పాల్గొనగా, 12 మంది వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు. గురువారం మిగిలిన క్రీడాంశాల్లో పోటీలు నిర్వహించనున్నట్లు తిరుపతయ్య తెలిపారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం అనంత లక్ష్మీ, పీఈటీలు సందానీ, షరీఫ్, జమునారాణి, శ్రీదేవి, శైలజ, సుమతి, మాలకొండయ్య, సుభాష్ పాల్గొన్నారు.

ప్రారంభమైన స్కూల్ గేమ్స్

చేజర్ల (సోమశిల): స్కూల్ లెవల్ గేమ్స్ బుధవారం కొత్తపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అనంతసాగరం ఎంఈఓలు బాలకృష్ణారెడ్డి, ప్రభాకర్‌రెడ్డి ఉదయం 9 గంటలకు ప్రారంభించారు. ఎంపికైన విద్యార్థులు ఈ నెల 21, 22 తేదీల్లో ఆత్మకూరు గవర్నమెంట్ హైస్కూల్లో నియోజకవర్గ స్థాయిలో జరిగే పోటీల్లో పాల్గొంటారని రేవూరు జెడ్పీహెచ్‌ఎస్ పీడీ గౌరిరెడ్డి తెలిపారు. కార్యక్రమంలో కొత్తపల్లి, రేవూరు జెడ్పీహెచ్‌ఎస్ హెచ్‌ఎంలు పి వెంకటేశ్వర్లు, ఏ వెంకటేశ్వర్లు, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

స్కూల్ గేమ్స్ పోటీలు ప్రారంభం

జలదంకి: జలదంకి ఉన్నత పాఠశాల మైదానంలో మండల స్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ క్రీడా పోటీలను బుధవారం జలదంకి హెచ్‌ఎం కొండారెడ్డి ప్రారంభించారు. అండర్–14, 17 విభాగాల్లో బాల, బాలికలకు క్రీడా పోటీలను నిర్వహించారు. మండలంలోని 5 ఉన్నత పాఠశాలలు, 11 ప్రాథమికోన్నత పాఠశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు. గురువారం కూడా కొనసాగుతాయని మండల స్పోర్ట్స్ కో–ఆర్డినేటర్ రమేష్‌రెడ్డి తెలిపారు.

క్రీడా జట్ల ఎంపికలు

అనుమసముద్రంపేట: మండలంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలు, కేజీబీవీ, మోడల్ పాఠశాలల్లో చదువుతున్న బాల బాలికలకు అండర్–14, అండర్–17 విభాగాల్లో క్రీడా జట్ల ఎంపికలను బుధవారం ప్రారంభించారు. కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, టెన్నికాయిట్, త్రోబాల్ తదితర విభాగాల్లో క్రీడాజట్ల ఎంపికలు జరుగుతున్నాయని ఎంఈఓలు ఎం.జ్యోతి, డీ సాయిప్రసాద్ తెలిపారు. క్రీడా జట్ల ఎంపికల్లో వ్యాయామ ఉపాధ్యాయుల అసోసియేషన్ సెక్రటరీ థామస్, మండల కో–ఆర్డినేటర్ వాసు, పాఠశాలల వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అర్హతే ప్రామాణికంగా పింఛన్ల మంజూరు


అప్పారావుపాళెంలో పింఛన్ లబ్ధిదారులతో జెడ్పీటీసీ ప్రసన్నలక్ష్మీ


చెర్లోయడవల్లిలో నూతన పింఛన్లు పంపిణీ చేస్తున్న ఎంపీపీ వేణుగోపాల్‌రెడ్డి


ఆత్మకూరు 23వ వారులో లబ్ధిదారులకు పింఛన్లు అందజేస్తున్న కౌన్సిలర్ కామాక్షయ్య


అనంతసాగరంలో కొత్త లబ్ధిదారుకు పింఛన్ పంపిణీ చేస్తున్న ఎంపీపీ సంపూర్ణమ్మ


కలిగిరిలో పింఛన్ నగదు పంపిణీ చేస్తున్న సర్పంచ్ దివ్య, ఉపసర్పంచ్ కొండారెడ్డి

ఆత్మకూరురూరల్: అర్హతే ప్రమాణికంగా లబ్ధిదారులు అందరికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పింఛన్లు మంజూరు చేస్తున్నారని, ఆత్మకూరు ఎంపీపీ కేతా వేణుగోపాల్‌రెడ్డి, జెడ్పీటీసీ పెమ్మసాని ప్రసన్నలక్ష్మీ అన్నారు. మండలంలోని రావులకొల్లు, చెర్లోయడవల్లి, అప్పారావుపాళెం, గండ్లవేడు తదితర గ్రామాల్లో మండలానికి మంజూరైన నూతన పింఛన్లను బుధవారం పంపిణీ చేశారు. వారు మాట్లాడుతూ ఈ నెల నుంచి మండలంలో మొత్తం 109 పింఛన్లు కొత్తగా మంజూరయ్యాయన్నారు. సచివాలయాల్లో వలంటీర్ల ద్వారా దరఖాస్తు చేసుకున్న వారందరికీ సాంకేతిక పరిశీలన అనంతరం పింఛన్లు మంజూరు చేయిస్తున్నామని తెలిపారు. ఆయా కార్యక్రమాల్లో నాయబ్, వైస్ ఎంపీపీ కంభంశెట్టి ప్రమీల, సర్పంచ్ మాముడూరు నరసింహులు, వీఆర్‌ఓలు సంపూర్ణ, లక్ష్మీదేవి, రమణయ్య, పంచాయతీ కార్యదర్శులు నరసింహులు, సంపూర్ణ, వైఎస్సార్‌సీపీ నాయకులు రామిరెడ్డి మోహన్‌రెడ్డి, పద్మారెడ్డి, చంద్రా హజరత్‌నాయుడు, దాడి శ్రీనివాసులునాయుడు పాల్గొన్నారు.

ముమ్మరంగా కొత్త పింఛన్ల పంపిణీ

ఆత్మకూరు: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అర్హతలు గుర్తించి సంక్షేమ పథకాలు అందిస్తోంది. ప్రధానంగా అవ్వా, తాతలకు, దివ్యాంగులకు అర్హత కలిగిన వారందరికి సామాజిక పింఛన్లు మంజూరు చేస్తూ నేరుగా వారి ఇళ్లకే వలంటీర్ల ద్వారా పింఛన్ అందజేస్తుండడంతో లబ్ధిదారులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఆత్మకూరు మున్సిపల్ పరిధిలో నూతనంగా మంజూరైన 132 పింఛన్లను ఆయా వార్డుల పరిధిలో కౌన్సిలర్లు, ఇన్‌చార్జిలు, వలంటీర్ల ద్వారా అందజేస్తున్నట్లు కమిషనర్ బి.నాగేశ్వరరావు బుధవారం తెలిపారు. 7వ వార్డులో కౌన్సిలర్ సయ్యద్‌నౌషాద్ బేగం, 10వ వార్డులో కౌన్సిలర్ తుమ్మల త్రివేణి, 19వ వార్డులో కౌన్సిలర్ కొండా స్వరూపరాణి, 20వ వార్డులో ఇన్‌చార్జి నందవరం ప్రసాద్, 23వ వార్డులో కౌన్సిలర్ కామాక్షయ్య వలంటీర్లు, సచివాలయ సిబ్బందితో కలిసి లబ్ధిదారులకు పింఛన్లు అందజేశారు.

కొత్తగా 318 పింఛన్లు మంజూరు

కలిగిరి: మండలానికి కొత్తగా 318 పింఛన్లు మంజూరయ్యాయని ఎంపీడీఓ ఆర్‌వీ కళాధర్‌రావు బుధవారం తెలిపారు. కలిగిరి గ్రామ సచివాలయంలో సర్పంచ్ రాగి దివ్య, ఉప సర్పంచ్ పాలూరు కొండారెడ్డి, వార్డు సభ్యులు కొత్త పింఛన్లను లబ్ధిదారులకు అందజేశారు. నాగసముద్రం సచివాలయంలో ఈఓపీఆర్డీ వెలుగోటి మధు, సర్పంచ్ డమ్ము శ్రీనివాసులు, ఉప సర్పంచ్ అక్కెం హజరత్‌రెడ్డి లబ్ధిదారులకు కొత్త పింఛన్ నగదును పంపిణీ చేశారు.

నూతన పింఛన్లు అందజేత

చేజర్ల: చేజర్ల సచివాలయంలో కొత్తగా మంజూరైన 15 పింఛన్లను లబ్ధిదారులకు బుధవారం ఎంపీపీ తూమాటి విజయభాస్కర్‌రెడ్డి, సర్పంచ్ ఆవుల వెంకటేశ్వర్లు అందజేశారు. కొత్తగా మంజూరైన పింఛన్లలో రెండు చర్మ కళాకారులకు, నాలుగు డప్పు కళాకారులకు, ఎనిమిది వృద్ధాప్య పింఛన్లు, ఒకటి వికలాంగ పింఛన్ ఉన్నాయి.

చేజర్ల (సోమశిల): అనంతసాగరంలో మండలంలో కొత్తగా మంజూరైన నూతన పింఛన్లను ఎంపీపీ పెయ్యల సంపూర్ణమ్మ బుధవారం పంపిణీ చేశారు. 153 మందికి ఎంపీడీఓ కార్యాలయంలో పంపిణీ చేశామని తెలిపారు. మండలానికి కొత్తగా మొత్తం 301 పింఛన్లు మంజూరైనట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ మధుసూదనరావు, సర్పంచ్ శోభ, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

నూతన పింఛన్లు పంపిణీ

వరికుంటపాడు: వరికుంటపాడు పంచాయతీలో నూతనంగా మంజూరైన పింఛన్లను బుధవారం స్థానిక సచివాలయంలో సర్పంచ్ కె.దిలీప్‌కుమార్ లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో అర్హులైన ప్రతి ఒక్కరికి పింఛన్ అందుతుందన్నారు. పంచాయతీలో కొత్తగా 19 పింఛన్లు మంజూరయ్యాయన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ప్రభుదాసు పాల్గొన్నారు.


లబ్ధిదారులకు నగదు అందజేస్తున్న సర్పంచ్ దిలీప్


నూతన పింఛన్ అందిస్తున్న ఎంపీపీ విజయభాస్కర్ రెడ్డి

స్థలం ఆక్రమించారని ఫిర్యాదు

ఉదయగిరి: పట్టణం కావలి మార్గంలో ఉన్న ఎస్టీ కాలనీలో తనకు ప్రభుత్వం మంజూరు చేసిన ఇంటి స్థలాన్ని కొంత మంది వ్యక్తులు ఆక్రమించి దౌర్జన్యం చేస్తున్నారని కాలనీకి చెందిన గెట్టిపోయిన వెంకటేశ్వర్లు బుధవారం తహసీల్దార్ జగదీష్‌బాబుకు ఫిర్యాదు చేశారు. తనకు ప్రభుత్వం సర్వే నం 1282–3డీ–1లో 0.5 సెంట్లు ఇంటి నివేశన స్థలం మంజూరు చేసిందన్నారు. ఆ స్థలాన్ని ఆక్రమించేందుకు కొంత మంది ప్రయత్నిస్తున్నారని విచారించి తనకు న్యాయం చేయాలని కోరారు.